

# అవునో కాదో ఆలోచించదు!

అవసరాల రామకృష్ణారావు

**చదువుతున్న** పుస్తకాన్ని చటుక్కున లాక్కున్న కాంతాన్ని చ స్తే నా కోపం ఆగలేదు.


"అలాగే. అది నీ దగ్గ ె వుంచుకో. ఇవాళ నీతో బయల్దేరితే అడు ు."

"లేకపోతే ఏమిటండీ : రీనీ? ఇదిగో లేస్తాను, అదిగో లేస్తాను అ ుడమేగాని మీ రందులోంచి ఊడిపడ్డ ెప్పుడు? అర గంటయింది, రిక్షావీధిగుమ్మం  నిలబడి...."

అంటూ పుస్తకాన్ని : మీదికి విసి రేసింది. ఆలోచించలేని  కదాన్ని కట్టు కున్నాక ఎంత గొంతు చించు ుంటే మాత్రం కలిసి ప్రయాణం చెయ్యక  ుగాడికి తప్పు తుంద? చచ్చినట్టు దాన్తోపాటే కిందికి దిగేను.

ఎప్పట్నుంచో పూర్తిచేద్దామనుకుంటున్న సైకాలజీ బుక్కు అది. మూడొంతుల బతుకు ఆఫీసులోనే అయిపోతుంది గనక ఇంటి కొచ్చి సేద తీర్చుకున్నాక కాస్త మనశ్శాంతి కలిగించే ఒకేఒక హాబీ నాయీ గ్రంథ పఠనం. ఈ మాత్రం హాయికే యీ ప్రాణి నోచుకోకపోవాలా! ఏభై యేళ్ళు వెళ్ళి పోయాయి, ఇంకెప్పుడు ఇవి చదవను! ఇక మా కాంతానిదంతా మరో పద్ధతి. పొద్దుటి పూట నాతోనే భోజనం కానిచ్చేస్తుంది గనక నే ఆఫీసుకి బయల్దేరిన గంటాగంటన్నరకి మా యింటికి తాళం పడిపోతుంది. ఒక్కొ క్కప్పుడు నే తిరిగొచ్చాక కూడా ఆ తాళం అలాగే వుంటుంది!

"అయ్యయ్యో....ఎంతసేపై వచ్చారండీ పాపం మీకివాళ ఆలస్యం అయిపోయింది కాబోలు....ఏంచెయ్యను చెప్పండి. వచ్చేద్దా మని ఎప్పుడనగా లేచి నిలబడ్డాను. చెయ్యి పట్టుకు కూచోపెట్టేస్తే ఎంతకని చావను!




ఉప్మా పొద్దుటే చేశాను. వేడిచేసి యిచ్చెయ్యడమే. ఒక్క నిమిషం."

ఇలా సాగుతుంది కాంతం ధోరణి.

కాస్త కడుపు చల్లపడ్డాక యిలా లేచి నాలుగడుగులు వేస్తానో లేదో, ముందే వెళ్ళి, మేడ మెట్లకి అడ్డంపడి చెయ్యిపట్టుకుని——

"కూచోండి, కూచోండి.. మీరే చాలా భోగట్టాలు చెప్పాలి. అవతల అంతఃపురం మీకోసం ఏం పారిపోదు లెండి' అని కూచోపెట్టేస్తుంది. అంతఃపురం అంటే నేను మేడ మీద గదిలో అమర్చుకున్న లైబ్రరీ అని కాంతం అభిప్రాయం. అందులోని రెండు అద్దాలబీరువాల్లో ఎప్పుడూకిక్కిరిసివుంటాయి, నేను ఓ జీవితకాలంపాటు సేకరించిన గ్రంథ రాజాలు. గడిచిన జీవితంలోని ఒడుదుడుకుల్లో పుస్తకపఠనానికి పూర్తిన్యాయం చేకూర్చలేకపోయానని పశ్చాత్తాపం కలుగుతోంది ఇప్పుడిప్పుడు. అందులో ఈ మధ్య కొత్తగా మన తత్వశాస్త్రం మీద మరింతగా మనసు మళ్ళుతోంది. అందుకే నా మనసు మీద బాగా ముద్రపడిన ఏ వ్యక్తి మన తత్వమో కాంతానికి వివరించాలనుంటుంది.

కాని దాని ధోరణి గమనిస్తే నా ఉత్సాహం నీళ్ళు కారిపోతుంది. "నాలుగు వీధులు తిరిగొచ్చిన నాకు యింక తెలియందేముంది, అలాంటిది, నాకు చెప్పేదేమిటి!" అన్నట్టు తనే మొదలెడుతుంది.

"కూచోండి, కూచోండి. అమ్మయ్య, కూచున్నారు గదా.... మళ్ళీ ఇవాళ ఆ అనంత నారాయణగారింటికి వెళ్ళేనంట .... తెలిసినట్టు అలా మొహం పెడతారేం, చెప్పానుగా ఆ మధ్య, కొత్తగా ట్రాన్స్ఫరై పెద్ద పోస్టాఫీసు పక్కవీధి వచ్చేరనీ, వాళ్ళే! అబ్బ, యెంత మర్యాదస్తులండీ వాళ్ళు! ఇంట్లో బిలబిల్లాడుతూ చిన్నా పెద్దా తిరుగుతూంటే ఆయన పిల్లలేమో అనుకున్నాను. కాదు సుమండీ, యెవరో బంధువులట! ఊరికే చుట్టపు చూపుగా వచ్చారేమో అనుకున్నాను, అదీ కాదుట, వాళ్ళంతా ఆయన కూడా ఏకంగా ఉండిపోయే వాళ్ళేనుట. ఈ రోజుల్లో ఇంతమందిని రోజుల తరబడి పోషించాలంటే యెంత దొడ్డబుద్ధి ఉండాలంటారు!"

"చూసీచూడనట్టు ఊరుకునే పై అధికార్లుంటే యెన్ని లంచాలయినా పట్టొచ్చు, యెన్ని కుటుంబాలయినా సాకొచ్చు. మన సొమ్మేంపోయిందీ!" అన్నాను విని విని ఊరుకోలేక.

"చాల్లెద్దురూ, కడుపున పుట్టిన పిల్లలు నాలుగు రోజులింటికొచ్చినా సర్దుకోలేక పీధిన పడిపోయే మనమూ చెప్పడమే నీతులు!"

అని అతిసాధారణంగా అని చేతులు తిప్పుతూ లోపలికి వెళ్ళిపోయింది. చివుక్కుమంది ఆ ముక్కకి నా మనసు. అంతలో తెప్పరిల్లేను. కన్నకొడుకులయితే మాత్రం, తండ్రి యింటికి వస్తేమటుకు, తాముకూడా పిల్లలు తండ్రులయారే, ఆ మాత్రం ఇంగిత జ్ఞానం వుండొద్దూ? ఇంతకీ వాళ్ళు అనుకోడంలో ఉందిగాని నేను పెట్టిన ఆంక్ష ఏమిటని! ఏదేనా కష్టం తోస్తే నాతో ఏడవకూడదూ, మధ్యని దాన్తో యెందుకూ?

"నువ్వెంతో అభిమానపడి రాస్తావు.... అమ్మమల్ని రమ్మని....ఏం లాభం! వెళ్లు మీరు తున్న కొద్దీ నాన్నగారికి మరీ పద్ధతులు పెరిగిపోయాయే అమ్మా. మవ్వేలా పడుతున్నావో ఏమో.... మొన్నరాత్రి ఏమైందీ.... ఆయన్నేం మేడగది ఖాళీచేసి యిమ్మన్నామా. కిందనే సర్దుకున్నాం.....ఏదో తప్పు పని చేసినట్టు చడీచప్పుడూ లేకుండా అర్ధరాత్రి తిరిగొచ్చి పడుకుంటే, ఈ సెకండ్‌షో సినిమాలేమిటని పొద్దుట 'తెయ్యి'ని ఆటా!'' అని చిన్నాడు కాంతంతో మంతనాలా! పోనీ ఆ పెద్దాడికి తల్లితో గుసగుసలు పోయే పోగాలమేమిటంట! 'మొన్న నువ్వూ కోడలూ ఇంట్లో లేరు కాబట్టి సరిపోయింది. నీకోడలు అసలే ముక్కుమీద కోపం గలది. మూణ్ణిమషాల్లో ప్రయాణం కట్టేసును యింకా నయం ఏం లేదూ....నానిగాడు నాన్నగారి గదిలోకి వెళ్ళి ఏదో పుస్తకం మీద సిరా ఒంపేశాడుట. వెధవకి నాలుగేళ్ళు రాలేదు, ఏం తెలుస్తుంది చెప్పు! అయితేనేం తాతగారి అయిదువేళ్ళూ అంటుకుపోయాయి....ఇవన్నీ యెందుకుగాని ఓ మాట చెబుతాం వింటూ....మాతో గడపాలనుంటే నువ్వే మా దగ్గరకి వచ్చేస్తూండవే అమ్మా!"

ఇదీ వీళ్ళ వరస. సిగ్గులేకపోతే సరి.... అందరూ కలిసి నన్ను వెలేస్తారా యేం! అంత శ్రమ అక్కర్లేదు. నేనే వాళ్ళని వెలివెయ్యగలను. 'కాస్త శుభ్రంగా వుండి వేళపట్టున క్రమం తప్పకుండా పనులు చేసుకోండర్రా!' అని చెప్పడం కూడా మహాపరాధమే.


నేనెంత కొట్టిపారేస్తున్నా ఎప్పటికప్పుడు యెందుకో అందుకు అనంతనారాయణగారిని కాంతం పొగుడుతూవుంటే, ఓ రోజు ఏమైతే అయిందని తనతో వెళ్ళి ఆ మహానుభావుణ్ణి కలుసుకున్నాను. చెప్పకేం నన్నతను ఏమంతగా ఇంప్రెస్ చెయ్యలేదు. అయితే కాంతం పదేపదే చెబుతున్న కొన్నికొన్ని లక్షణాలు మాత్రం కొట్టిపారెయ్యడానికి వీలులేనివే. మనిషికోసం వాచిపోయినట్టు ఓ మాటు కలుసుకుంటే ఓ పట్టాన విడిచిపెట్టడు అతను. ఇల్లు కిటకిటలాడిపోతూ వుంది మనుషులతో. అంత గందరగోళంలోనూ అతని నుదుట చిన్న కోపరేఖయినా స్ఫురించకపోడం ఆశ్చర్యమే.

"ఇప్పుడిలా వచ్చి వెళ్ళేడు చూశారా.... అతను మా సుభద్ర తమ్ముడు. ఏం చేస్తాం.

అందరికీ అన్నీ పట్టుబడవు. యెన్నిసార్లు యెంతగా ట్రై చేసినా మా బావమరిది గ్రాడ్యుయేటు కాలేకపోయాడు. అలాగని అతన్ని శిక్షించలేం గదా.... ఈలోగా పెళ్ళి అయింది. పిల్లలూ పుట్టుకొచ్చారు. ఏదైనా చిన్న వుద్యోగం వేయించలేకపోతానా అని తీసుకొచ్చేను. నా వల్ల అదీ అయింది కాదు. తీరా ఆశపెట్టి ఇవ్వరు వాళ్ళని రమ్మంటే యెక్కడికి పోతారు? ఏదో భగవంతుడు మాకు ఇంత ఇచ్చాడు. కష్టపడి నే సంపాదించి తెస్తూంటే మా సుభద్రయింట్లో కూచుని తినడం బాగుండా, దాని తమ్ముడికి ఆ హక్కు లేకపోయిందా? మాతోపాటే వాడికి మాత్రం చారూ అన్నం పెట్టలేకపోతామా అని ఏకంగా వచ్చెయ్యమన్నాను."

అతను యిలా చెప్పుకుపోతూవుంటే 'భవా!' అని పిలుస్తూ మరో నడివయస్సు మనిషి అతనికి తాళాలు యిచ్చి వెళ్ళేడు. అంతేం, చిక్కు విడిపోయింది! ఆలివంక వారు ఆత్మబంధువులన్నారు. పెళ్ళాంపోరు పడలేక ఆ బంధుత్వమున్నందర్నీ తెచ్చి పోషిస్తున్నాడు కాబోలు! దీనికేదో పెద్దగా 'దయాగుణం' అంటూ ముసుగు కూడా దేనికి? ఇంత చిన్న విషయం కూడా పోల్చుకోలేదా కాంతం!...ఇలా సాగిన నా భావన అతను యిచ్చిన సమాచారంతో గాలికి కొట్టుకుపోయినట్టయింది. ఆతగాడు అతని పెళ్ళాం తరపు వాడేకాడు. చెల్లెలి మరిదిట. మూడేళ్ళ వరసగా 'వాళ్ళ పంటలు నాశనమై అన్నీ అమ్మేసుకుని వీధిలో పడిపోయారట. అతని ఊరి వాళ్ళేట. సాటి మనుషులు బతికిపోయి బతికిలా పడిపోతే చూడలేక తనతోపాటే కలో గంజో తాగుదురుగాని పదండన్నాడు. అప్పట్నుంచీ అక్కడే వుంటున్నారుట వాళ్ళంతా!

"ఏదో అనుకుంటామగాని నేను వాళ్ళకి చేస్తున్నదేముందండీ, నా మొహం మాకున్న ఒక్క అమ్మాయి బొంబాయిలో ప్లాట్ కొనుక్కుని స్థిరపడిపోయింది. ఇక యీ వయస్సులో కష్టానికీ సుఖానికీ మమ్మల్ని అడుగువే వాళ్ళెవరు చెప్పండి నన్నూ సుభద్రనీ ఒక్కపని ముట్టుకోనివ్వరు. వాళ్ళెంత తల్లో నాలికలా మసలుతున్నా నా కర్మకి కర్తలు కాలేరు గదా. ఓ పక్కనుంచి గుండెజబ్బు నన్ను కోరేస్తోంది. ఇంతగా వీళ్ళందరూ కంటికి రెప్పలా నన్ను చూసు



కోకపోతే యెప్పుడో టపా కట్టేద్దును. కారులో వెళ్ళి ఓ గంటసేపు సంతకాలు పెట్టి వచ్చే ఉద్యోగం కాబట్టి సరిపోయింది గాని ఇంతకీ చెప్పేదేమిటంటే...."

అని జేబులోంచి ఓ మాత్ర తీసుకుని వేసుకుని, ఇన్ని మంచినీళ్ళు తాగి, ఓ గడీ ఆగి, ఆయాసం తగ్గేక, ఇలా చెప్పుకొచ్చాడు,

"పదిమంది వున్న కుటుంబంలో పుట్టానండీ నేను. ఇల్లెప్పుడూ పిల్లాపాపలతో గొల్లుమంటూ వుండాలని నా కోరిక. ఎక్కడో దూరపు వాళ్ళని తెచ్చి ఇల్లు నింపుకోడంలో నా స్వార్థం ఇదే అనుకుంటాను. ఇలాగే వెళ్ళిపోతే ధన్యుణ్ణి. ఇప్పుడే కాదు, మహా మహా వయసులో ఉన్ననాడే, పిడికెడు మెతుకులు మించి తినడానికి నా ఆరోగ్యం అనుమతించలేదు. అయితే చుట్టూ పదిమంది భోంచేస్తూవుంటే చాలు. నా కడుపు నిండిపోయి నట్టే వుంటుంది...."

ఆ రాత్రి నా లైబ్రరీలో కూచుని చేతిలో సైకాలజీ పుస్తకం తెరచి పట్టుకున్నానే గాని ఒక్క అక్షరం జరగలేదు. అదేం ఆశ్చర్యమో. అనంతనారాయణగారి విచిత్ర మనస్తత్వం నాకు అంతుపట్టలేదు. ఆ కబుర్లు నన్ను వదల్లేదు. నా మనసు తిరగబడకా ఊరుకోలేదు. ఎక్కడోవున్న వాళ్ళని, పోనీ జీవితంలో దెబ్బతిన్న కొందర్నే, ఆదరించి యింత నీడ కల్పించానంటున్నాడు. మంచిదే వాళ్ళగురించీ, తద్వారా తనగురించీ వివరించాడు, బాగానే వుంది యెదుట కూచున్న నా గురించి ఒక ముక్క అడిగి తెలుసుకోలేదేం! గంటన్నర వున్నాను వాళ్ళింట్లో....సాటి మనిషిని, ఇంచుమించు అతని వయస్సువాణ్ణే, నాకూ భార్యాబిడ్డలుంటారనీ, ప్రాబ్లెమ్సు వుండితీరతాయనీ, యెదుటి మనిషి ప్రసక్తిలో కూడా కొంతకాలం ఖర్చు చెయ్యవలసి ఉంటుందనీ, అంతటి ఉన్నతుడికి సహా, తోచలేదేం!

"మీ వన్నీ కుశంకలూ చొప్పదంటు ప్రశ్నలూ. నేనాయన్ని కలుసుకున్న మొదటి రోజునే నన్ను ఓ గంట దగ్గర కూచోపెట్టుకుని మనగురించి అన్నీ అడిగి తెలుసుకున్నారు. ఇంక వేరే మిమ్మల్ని భోగట్టా చెయ్యవలసిన అవసరం ఏముందీ!"

అని నా అనుమాన నివృత్తి చెయ్యాలని చూసింది కాంతం.

"అలాగా! నీద్వారా మన కబుర్లు తెలిసి వుంటాయనుకున్న పెద్దమనిషి, నీద్వారానే తన కబుర్లు నాకు చేరి వుంటాయని ఎందుకు ఊరుకే లేకపోయాడు. గంటలకొద్దీ సొంత డబ్బాతో నా గూబ అదరగొట్టేడే, ఏం పాపం చేశానని!"

"అవునేండి మరి, పచ్చ కామెర్ల కళ్ళకి...."

"....అన్నీ పచ్చగానే కనిపిస్తాయి. అంతే కాదు. ఎప్పుడూ పచ్చిగానే వుండిపోయేవాళ్ళ కళ్ళకి ప్రతి చిన్నవిషయమూ ఆశ్చర్యంగానే కనిపిస్తుంది...."

"మనలా అందరూ ఒంటెత్తు రామలింగం గాళ్ళు కాదని ఎందుకండీ అలా మండిపడతారు? దీర్ఘరోగాలతో తీసుకుంటున్నారు పాపం ఆ మొగుడూ పెళ్ళాలు, పిసరంత సానుభూతి లేదేం? ఇంక ఆరునెలల్లో ఎలాగా రిటైరు అయిపోతాట్ట, ఇక్కణ్నుంచి వెళ్ళిపోతారు. చేతనైతే ఓమారు వెళ్ళి ఎలా వున్నావని పలకరించి రండి. లేదూ చల్లగా ఊరుకోండి. వ్యాఖ్యానాలుకూడా దేనికీ?"

నేను ఊరుకోదల్చుకోలేదు. ఊరుకోలేక పోతున్నానుకూడా.

మాయదారి అనంతనారాయణగారు ఎరక్కపోయి మా ఊరు వచ్చాడు. వారం రోజులకోసారైనా అతనిగురించి మేమిద్దరం ఈమధ్య వాదించుకోకుండా వుండలేక పోతున్నాం. ఏదో పొడిముక్కలు జవాబు చెప్పేసి ఇంట్లో అయినా నా పనులు నిశ్శబ్దంగా చేసుకోడం నాకు అలవాటు. అలాంటిది గంటలకి గంటలే కబుర్లలో దొర్లించే ఈ కొత్తపద్ధతి నాకెప్పుడు అలవడింది! అంతే కాదు, మునుపు కాస్త అధిక ప్రసంగం కాంతంచేస్తే కసిరికొట్టేవాణ్ణి, ఇప్పుడు దగ్గిర కూచోబెట్టుకుని, అందులోనూ నా గ్రంథాలయం గదిలో, మంతనాలు సాగిస్తున్నానేమిటి! ఇది నాకు బాగా గ్రహింపుకి వచ్చేసరికి ఆ కాస్త పుణ్యకాలం, అదే ఆ ఆరు నెలలూ అవనే అయిపోయాయి! మళ్ళీ ఆ గుమ్మం తొక్కలేదుగాని ఆ పెద్దమనిషి పరోక్షంగా నామీద చూపించిన ప్రభావం తక్కువది కాదు....

"అమ్మయ్య....ఎలా వచ్చినవాడు అలా, గాలీ వానాలా, పరివారంతో సహా వాళ్ళ ఊరు వెళ్ళిపోయాడు గద....బతికాం బాబూ...."

అనుకోబోయి ఆ మాటే పైకి అనేశాను. కాంతం ఊరుకుంటుందా! 'ఎందుకండీ, పాపం, అంత మంచిముండా వాణ్ణి పట్టుకుని అలా కంటగించుకుంటారూ? 'జబ్బు ముండా వాణ్ని నేను రాలేను నన్ను క్షమించి మీరే వస్తూండండి' అని రెండుచేతులూ పట్టుకు బతిమాలినా మళ్ళీ అటువైపు తొంగి చూడలేదే! ఆయన ఈ ఊరు వదిలేసినా మీకాయన మీద కక్ష తీరలేదా? ఏమిటి ఆయన చేసిన నేరం? మీలా మూతి ముడుచుకుని ధుమధుమలాడుతూ ఓమూలాన కూచోలేదనేగా! పదిమంది కావాలి ఆయనకి. తనలో తను ముడుచుకుపోయే ఒంటరి స్వభావం ఆయనకి గిట్టదు. ఊకదంపుడనీ, పోచికోలు కబుర్లనీ మీరెన్ని పేర్లెట్టినా, చూశానుగదా, అవే ఆయనకిష్టం. తను చెప్పింది పదిమంది వినాలనుకోడంకూడా ఓ తప్పే? దానికైనా బలవంతం లేదుగా, పైగా వాళ్ళని చచ్చినట్టు పోషిస్తున్నాడు కూడా.'

నేను కొత్తసంగతి కనుక్కున్న ఆనందంతో చప్పట్లుకొట్టేను. తనకు తెలీకుండానే అసలు సంగతి అందించినందుకు కాంతాన్ని అభినందించాను. అది తెల్లమొహం వేస్తే అసలు సంగతి యిలా వివరించాను....

"చూశావా, చూశావా? ఎన్నోసార్లు వాళ్ళ యింటికి వెళ్ళేవు కాబట్టి నువ్వు కనిపెట్టేవు గాని నేను కనిపెట్టలేకపోయాను. అతన్లో ఎంత నైచ్యముందో నీ నోటితోనే చెప్పిస్తాను చూడు. చదువుకున్నవాళ్ళకీ లేనివాళ్ళకీ అదే తేడా మరి. ఇలాంటి తిరకాసు ఏదో వుందని మొదట్లోనే నేను పసిగట్టేనుగాని ఇదమిద్ధమని యిప్పుడుగాని చెప్పలేకపోతున్నాను. అమ్మయ్య! ఇప్పుడు నాకెంత తేలిగ్గా వుందో.. సరే ముందు ఓ ప్రశ్నకి జవాబుచెప్పు. ఈ అనంతనారాయణగారిని ఎవరో జమీందారిణి పెంచుకుందనీ తరతరాలకి సరిపోయే ఆస్తి ఇచ్చిందనీ నువ్వు చెప్పినట్టు గుర్తు?"

"అవును. అయితే అంతమందిని చేరదియ్యాలని యెక్కడుం...."

"ఆగాగు. అంతా పూర్తిగా విని నువ్వే


ముచ్చటైన ముద్రణకు
మరో పేరు



క్రాంతి ప్రెస్,
2, ఫ్రాన్సిస్ జోసెఫ్ స్ట్రీట్,
మద్రాసు - 600 001.
ఫోన్: 24763


చెప్పు. అనంతనారాయణగారికి ఆఫీసులో అట్టే పనిలేని ఉద్యోగం. అంతటి ఆస్తికి యజమాని. వయసు మళ్ళిన మనిషి కాబట్టి జీవితంలో యెన్నో అనుభవాలు ఉంటాయి. తను చెప్పింది పదిమంది వినాలనుకోడం తప్పు కాదని నువ్వే అన్నావు ఇప్పుడు. అందుకే అందర్నీ పోషిస్తున్నాడేమో!"

"అంటే" అంది కాంతం ఎప్పుడూలేని కటువుదనం స్వరంలో సూచిస్తూ. తనకి బోధపడుతోందని గుర్తించిన ఆనందంతో మరింతగా పోశన గుప్పించి కొనసాగించాను.

"చూడూ పూర్వకాలం రాజులు కొలువు తీర్చేవారు. పోషింపబడుతున్న బానిస ప్రజలతో సభలు కిటకిటలాడిపోయేవి. రాజు ఏం చెప్పినా వినకుండా తప్పించుకోడం వాళ్ళకి కుదిరేది కాదు. పోనీ యిప్పటి ప్రజాస్వామ్యంలో మీటింగులే తీసుకో. మనిషికి యింతని కూలి ఇచ్చి ఊళ్ళనుంచి లారీలనిండా సభలకి శ్రోతల్ని చేరేస్తున్నారు. మీ అనంతనారాయణగారు చేస్తున్న ఏర్పాటూ అలాంటిదే-ఏం?" కాంతం జవాబు చెప్పకుండా తప్పించుకోడం ఉత్సాహాన్నిచ్చింది నాకు.

"అంత విశ్వమానవప్రేమే అతనికుంటే రెండు కుటుంబాలతో పరిపెట్టేడేం? దిక్కులేని వాళ్ళకి దేశంలో లోటేమిటి? వాళ్ళ వాళ్ళలోనే వుంటాయి ఇంకా బతికి చెడిన కుటుంబాలు—అవన్నీ తర్లించుకు రాడేం? ఈ పదిమంది శ్రోతలూ అతనికి చాలు. తను చెప్పాలనుకున్నప్పుడు మనుషులు దొరకచ్చు, దొరక్కపోవచ్చు. అందుకే డబ్బుతో కట్టి పడేస్తున్నారు. లేనివాళ్ళని కొందరినైనా పోషిస్తున్నామని పైగా పెద్ద పోజు. డబ్బున్న వాళ్ళందరికీ ఇదే జబ్బు. లేనివాళ్ళ లేమికి పూర్తిబాధ్యత తమదే అని స్పష్టంగా తెలుసు, అద్ది కప్పిపుచ్చుకోడానికి కొందరైనా మంచి పనులు చేస్తున్నట్టు నటన. వాళ్ళని నిలువునా కన్నీళ్ళలో ముంచి, నలుగురికీ కనపడేలా ఒకటో అరో కన్నీటి బిందువులు తుడిచి, 'ఎంత మంచివాడో!' అని పేరు కొట్టెయ్యాలని తపన."

నాకు బోధపడిన పుస్తకాల్లో ముక్కలు అలా ఉద్రేకంతో చెప్పుకుపోతూ ఓసారి తలెత్తి చూస్తే 'ఇవన్నీ కాంత ఫాలో అవలేదేమో పాపం' అనిపించి మామూలు ధోరణికి వచ్చేశాను.




"ఒక్కటి చెబుతాను వినుకాంతం, కొందరు మనుషులు తమకంటే చేలోకువగా వున్నవాళ్ళనీ, తమకి మళ్ళీ ఏ విధంగానూ జవాబు చెప్పుకోలేని తక్కువ హోదా మనుషుల్నీ, తమకూడా తిప్పుకుంటూ వుంటారు. ఆవిధంగా తమ ఆధిక్యత ప్రకటించుకుంటూ వుంటారు. ఒక్కటి తెలుసుకో. అలాంటి వాళ్ళని చూసి మెచ్చుకోడానికి మాత్రం ఏం లేదు — ఏం నే చెప్పింది ఒప్పుకుంటావా, నాతో ఏకీభవిస్తావా?"

ఆ ఆఖరిమాట అడుగుతూంటే నా స్వరం వణికింది. నాకే ఆశ్చర్యం వేసింది ఆ మాటల అర్థానికి. నాకు గుర్తున్నంతవరకూ నేనెప్పుడూ కాంతాన్ని సరిసమానంగా చూసిందిలేదు. చేస్తే వంటపనీ, తప్పితే పెత్తనాలూ, ఇంతకుమించి దానికి పెద్ద హోదా కల్పించి నీ అభిప్రాయం ఏమిటని ఇప్పుడడిగినట్టు అడిగింది లేదు. అయితే అన్నిటికన్న పెద్ద ఆశ్చర్యం ముందే వుందని ఆ క్షణం నే నెరగను. కాంతం అలా మాట్లాడగలదని నేను కల్లో అయినా ఊహించలేదు మరి!

"మీరు చెప్పింది నిజంలాగే తోస్తోంది. కొందరేకాదు అందరూ అంతేనేమో.... అదే మానవ స్వభావం అయితే అది జాలిపడవలసిన దౌర్బల్యంగాని తక్కువచూపుచూడవలసినంత దుర్మార్గంలా మాత్రం నాకేం కనపడ్డంలేదు. అందుకే మీరు చెప్పింది కాదనలేక పోయినా అనంత నారాయణగారిలో ద్వేషించేది మాత్రం నాకేం కనపడ్డంలేదు. అయితేఈ మీ అంతఃపురం నాలుగు పక్కలా కలియజూస్తే స్పష్టంగా తెలుస్తోంది ఆయనంటే మీకెందుకు అంత ఇష్టం లేకపోయేదో.... ఆయనా మీరూ చేస్తున్నది ఇంచుమించు ఒకటే.... అందుకే కాబోలు మీ మధ్య అంత పోటీ!"

నేను మధ్యలో కలిపించుకోబోతే, ఆపి, కొనసాగించింది.

"నా మాటల్లో మీకు తోచినట్టే మీ మాటల్లోంచే నాకు కొత్త విషయం స్ఫురిస్తోంది యివాళ. కొందరు మనుషులు తమకి మళ్ళీ ఏ విధంగానూ జవాబు చెప్పుకోలేని వాళ్ళని పోగుచేస్తారని చెప్పింది మీరే. అదే ఓ గొప్పగా చెప్పుకుంటూంటారని చెప్పింది మీరే. ఇప్పుడు తెలిసింది ఈ పుస్తకాలంటే మీకెందుకంత ప్రాణమో.... అవి మీ సొంత ఆస్తి. అట్టలువేసి పేర్లు రాసుకున్నారు. అద్దాల బీరువాలలో తాళాలు వేసి బిగించారు. మీ కిష్టమైనప్పుడు ఇష్టమైన పద్ధతిలో ఉపయోగిస్తున్నారు. నోరులేనివి. నోరెత్తలేనివి. ఇదంతా విజ్ఞానమని మళ్ళీ పెద్దపోజు. ఇంత కంటె మనుషుల్తో సంబంధాలు నయం కావంటారా!"

ఇంక వినడానికి శక్తిలేదు. గబగబా మేడ దిగిపోయాను.